9న పుదుచ్చేరి బహిరంగసభకు

విజయ్

● టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్


అనుమతి లేఖతో బుస్సీ ఆనంద్

పుదుచ్చేరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఈ నెల 9వ తేదీన బహిరంగసభ నిర్వహించుకునేందుకు తమకు అనుమతి లభించిందని, పార్టీ అధినేత విజయ్ సభలో పాల్గొంటారని తమిళగ వెట్రి కళగం (టీవీకే)ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో శుక్రవారం (డిసెంబరు 5న)రోడ్‌షోలో విజయ్ పాల్గొనేందుకు ఆ రాష్ట్ర పోలీసు శాఖ శాంతిభద్రతల కారణం చూపి నిరాకరించింది. అయితే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా విశాలమైన ప్రాంతంలో బహిరంగసభ నిర్వహించదలిస్తే తప్పకుండా అనుమతి ఇస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు ఈ నెల 9వ తేదీన టీవీకే మహానాడు జరుపుకునేందుకు అనుమతి కోరుతూ ఎస్పీ కలైవానన్ వద్ద టీవీకే నేతలతో కలిసి బుస్సీ ఆనంద్ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన ముఖ్యమంత్రి రంగస్వామి ఉప్పలం హార్బర్ గ్రౌండులో విజయ్ పాల్గొననున్న టీవీకే మహానాడుకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. దీనితో బహిరంగసభ నిర్వహించనున్న ప్రాంతాన్ని పోలీసు అధికారులు, బుస్సీ ఆనంద్, స్థానిక టీవీకే నేతలు పరిశీలించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం అసెంబ్లీకి వెళ్లి ముఖ్యమంత్రి రంగస్వామిని సంప్రదించిన బుస్సీ ఆనంద్ బృందం ఆయన నుంచి బహిరంగ సభ జరుపుకునేందుకు అనుమతించిన లేఖను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ, తమ పార్టీ తరుఫున పుదుచ్చేరిలో మొట్టమొదటిసారిగా నిర్వహించదలిచిన బహిరంగసభలో విజయ్ పాల్గొంటారని, ఈ సభకు లక్షలాది మంది తరలివచ్చే అవకాశముందని, కరూర్ సంఘటనను దృష్టిలో ఉంచుకుని రద్దీని నివారించే విధంగా వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.


బిగ్‌టెక్ సంస్థలో ఉత్పత్తిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఎలక్ట్రానిక్స్ రాజధానిగా తమిళనాడు

● ద్రావిడ మోడల్ పాలనకు ఇదే నిదర్శనం
● బిగ్‌టెక్ కంపెనీ ప్రారంభోత్సవంలో సీఎం

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశం మొత్తమ్మీద ఎలక్ట్రానిక్స్ రాజధానిగా తమిళనాడు నిలిచిందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. తమ ద్రావిడ మోడల్ పాలన అద్భుతంగా ఉందని చెప్పడానికి అమెరికాకు చెందిన 'బిగ్‌టెక్' కంపెనీ రావడమే తార్కాణమని ప్రకటించారు. కాంచీపురం జిల్లా పిళ్లైపాక్కం సిప్కాట్‌లో ఏర్పాటైన బిగ్‌టెక్ కంపెనీని ముఖ్యమంత్రి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అంతేగాక ఈ కంపెనీలో ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, భారత్‌కు చెందిన ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకాం లిమిటెడ్ కంపెనీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థ భారత్ ఇన్నోవేటివ్ గ్లాస్ టెక్నాలజీస్ కంపెనీ అని పేర్కొన్నారు. ఈ సంస్థ రూ.1,003 కోట్ల పెట్టుబడితో 840 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిని స్థాపించిందన్నారు. అంతర్జాతీయ కంపెనీ అయిన కార్నింగ్ ఇంటర్నేషనల్ కంపెనీ తమిళనాడు గడ్డపై ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గొరిల్లా గ్లాస్‌ను తయారు చేసే ఈ కంపెనీ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటి అని, ఇలాంటి సంస్థ తమిళనాడులో పెట్టుబడులు పెట్టి, మన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం ఆనందదాయకమన్నారు. మును ముందు రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెడతామని ఆ సంస్థ నిర్వాహకులు తనకు హామీ ఇచ్చారన్నారు. ఈ సంస్థ మరింత అభివృద్ధి చెంది రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, తద్వారా మరింతమందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం ఎంతటి వేగంగా పని చేస్తుందో, ఎంత దూరదృష్టితో పని చేస్తుందో చెప్పడానికి ఈ సంస్థ ఏర్పాటే నిలువెత్తు ఉదాహరణ అని వివరించారు. గత ఏడాది జనవరిలో ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని, ఇంతలోనే దీనిని ప్రారంభించిందని ప్రశంసించారు. పరిశ్రమల ఏర్పాటుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో తరలి రావాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. పరిశ్రమలతోనే రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఇప్పటికే వెయ్యికి పైగా పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకుందని, 80 శాతం పనులను ప్రారంభించాయని వివరించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో 14.65 బిలియన్ డాలర్ల వస్తువుల ఎగుమతితో ఇండియాలోనే నంబర్ వన్‌గా రాష్ట్రం వుందన్నారు. భారత్ మొత్తమ్మీద ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో తమిళనాడు నుంచి 40 శాతం వున్నాయన్నారు. గత నాలుగేళ్లలో ఈ విభాగంలో ఎగుమతి 9 రెట్లు పెరిగిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు, రాష్ట్రాభివృద్ధి కలగలిపి చేసేనే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అన్ని జిల్లాల్లో అభివృద్ధి వుండాలని అధికారులకు దిశానిర్దేశం చేశానన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తూత్పత్తి సంస్థలు కాంచీపురం, హోసూరు, కోయంబత్తూరు, తిరుచ్చి, తిరునల్వేలి వంటి జిల్లాల్లో ఇప్పటికే విస్తరించాయని సీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర చిన్నమధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్, ఎమ్మెల్యే సెల్వ పెరుందగై, అరుణ్‌రాయ్, తమిళనాడు పరిశ్రమల విభాగ డైరెక్టర్ అలిమేల్‌మంగై, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్విమోహన్, కార్నింగ్ కంపెనీ వైస్‌చైర్మన్ యాంగ్రూ బెగ్, డైరెక్టర్ రవికుమార్ కటారే తదితరులు కూడా పాల్గొన్నారు.


జయ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఈపీఎస్ - అమ్మకు నివాళులర్పించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు

రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకే పాలన

● ఈపీఎస్ శపథం ● జయ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నివాళి

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆదరణతో మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దివంగత ముఖ్యమంత్రి జయలలిత సమాధి వద్ద శపథం చేశారు. జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల పేరుతో పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలు నిర్వహించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జయలలిత చిత్రపటానికి అన్నాడీఎంకే శ్రేణులు పూలుచల్లి నివాళులర్పించారు. మెరీనా బీచ్‌లోని ఆమె సమాధి వద్ద ఈపీఎస్ ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో పాటు అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళమగన్ హుసేన్, మాజీమంత్రులు కేపీ.మునుస్వామి, డి.జయకుమార్, వలర్మతి, గోకుల ఇందిరా, వైగై సెల్వన్, నత్తం విశ్వనాథన్, ఎస్పీవేలుమణి, ఆర్బీ ఉదయ్‌కుమార్, కడంబూరు రాజు, సెమ్మలై, బీవీ.రమణ, మాధవరం మూర్తి, తంగమణి, సీవీ.షణ్ముగం, డాక్టర్ తంబిదురై, ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్, వెట్రివేల్ మారిముత్తు, జిల్లా కార్యదర్శులు టీ.నగర్ సత్య, ఆర్ఎస్ రాజేష్, బాలగంగా, మాజీ ఎంపీలు తదితరులతో పాటు కార్యకర్తలు పెద్దసంఖ్యలో నివాళులర్పించారు.

రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకే పాలన

జయమ్మకు నివాళులర్పించిన అనంతరం ఆమె ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకున్న ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)పార్టీ నేతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను మెజారిటీ స్థానాల్లో గెలిపించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అమ్మకు అంకితం చేస్తామని ధీమావ్యక్తం చేశారు. దేశరాజకీయ చరిత్రలో పేదప్రజల మనసులు దోచుకుని తిరుగులేని ప్రజాశక్తిగా దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత రాణించారని కొనియాడారు. మాజీముఖ్యమంత్రి ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకేను ఐదుసార్లు అధికారంలో కూర్చోబెట్టి సుమారు 5కోట్ల మందికి పైగా సభ్యులతో పార్టీని కంటికి రెప్పలా కాపాడి ముందుకు నడిపించిన మహానేత అని కీర్తించారు. సినీ, రాజకీయ రంగాల్లో చక్రం తిప్పి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ముఖ్యమంత్రిగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేలా కృషిచేశారని, ముందు చూపు, స్పష్టమైన ఆలోచనలతో పథకాలు అమలుపరిచి రాష్ట్ర హక్కులను కాపాడిన ఘనకీర్తి జయమ్మదేనన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణకు సాధ్యంకాని హామీలతో రాష్ట్రప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం తాగునీటి పన్ను, డ్రైనేజీ పన్ను, ఆస్తిపన్ను, రిజిస్ట్రేషన్ల పన్నులను విపరీతంగా పెంచారని, ప్రజావ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే తమ ఏకైక లక్ష్యమని ఈపీఎస్ సభాముఖంగా శపథం చేశారు. దివంగత మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండి అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సంతోషంగా గడిపారని, మళ్లీ అలాంటి పాలనను తీసుకొచ్చేందుకు సైనికుల్లా పార్టీ కార్యకర్తలు పాటుపడాలని ఈపీఎస్ పిలుపునిచ్చారు.

కొత్త పార్టీ పెట్టే ఉద్దేశం లేదు: ఓపీఎస్

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాను తాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నానని, తనకు కొత్త పార్టీ పెట్టే ఉద్దేశం ఏ మాత్రంలేదని అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఓపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై రాష్ట్రప్రజల మనోభావాల గురించి అమిత్‌షాతో చర్చించినట్లు తెలిపారు. అన్నాడీఎంకే మళ్లీ ఏకం కావాలనే తాను కోరుకుంటున్నానని, సొంత పార్టీ పెడతానని ఇప్పటివరకు ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. అన్నాడీఎంకే నుంచి వైదొలుగుతున్న పలువురు డీఎంకేలో చేరుతున్నందువల్ల పార్టీ బలం తగ్గదని, అన్నాడీఎంకేకు కార్యకర్తలే బలమన్నారు.

మద్రాస్ వర్శిటీలో

ముగిసిన ధర్మనిధి ఉపన్యాసాలు



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన ధర్మనిధి ఉపన్యాసాలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం మొత్తం మూడు ధర్మనిధి ఉపన్యాసాలు జరగ్గా.. నాల్గవ సమావేశమైన 'ఎస్ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసం'లో.. సికింద్రాబాద్ నుంచి విచ్చేసిన యోగాలయ సంచాలకులు డాక్టర్ వాసిలి వసంతకుమార్ 'తెలుగు పత్రికలు - వికాస క్షేత్రాలు' అనే అంశంపై ప్రసంగించారు. తొలిదశలో తెలుగు పత్రికలు పాండిత్య ప్రకర్ష గల సాహిత్యకారుల కలాల నుంచే వెలువడ్డాయని, అందుకే ఆ పత్రికలలో ప్రాచీనాంధ్ర సొబగులు మిక్కుటంగా కనిపిస్తాయన్నారు. ఐదో సమావేశంలో యోగి వేమన విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, తెలుగుశాఖాచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి 'ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ధర్మనిధి ఉపన్యాసం' చేస్తూ.. మాడభూషి సాహిత్యాన్ని ఆవాహనం చేసుకున్న కవిగా, తనను తాను దిద్దుకొని విశాల ప్రపంచాన్ని చూసినవారని, మానవ మనస్తత్వాన్ని చదివినవారని పేర్కొన్నారు. 6వ సమావేశంలో భాగంగా 'ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ 'తెలుగు-తెంగ్లీష్-ఇంగ్లీష్: అంతర్జాలంలో ధోరణలు' అనే అంశంపై ప్రసంగించారు. సాయంత్రం జరిగిన ముగింపోత్సవానికి మద్రాస్ వర్శిటీ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించగా, జియర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుశాఖ పూర్వ వైభవాన్ని ధర్మనిధి ఉపన్యాసాల ఏర్పాటు తీరును అభివర్ణిస్తూ తెలుగు శాఖ కార్యక్రమ నిర్వహణ విశిష్టతను, ఈ శాఖలోని అధ్యాపకులు, విద్యార్థుల అనుబంధాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు కె.రాధాలక్ష్మి, ఆత్మీయ అతిథిగా దివంగత సినీ నటి సూర్యకాంతం కుమారులు, హోమియోపతి కన్సల్టెంట్ డాక్టర్ దిట్టకవి అనంత పద్మనాభమూర్తి హాజరై ధర్మనిధి ఉపన్యాసాల విశిష్టతను, తెలుగుశాఖ కృషిని కొనియాడారు. ధర్మనిధి ముగింపు సందేశాన్ని రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయుమారి అందించారు.

ఇంకా శివారును వీడని
వాననీరు
● ఐదవరోజూ తప్పని అగచాట్లు
● పాములు సంచరిస్తుండడంతో భయాందోళనలు
8లో

తిరుప్పరంకుండ్రం వ్యవహారం!

● 9కి విచారణ వాయిదా వేసిన హైకోర్టు ● 153 మంది ఆందోళనకారులపై కేసు నమోదు


తిరుప్పరంకుండ్రం కొండ

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే వ్యవహారంపై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసు ఈ నెల 9వ తేదీకి హైకోర్టు మదురై బెంచ్ వాయిదావేసింది. తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీప స్తంభంపై కార్తీక దీపం వెలిగించాలని ఈ నెల 1వ తేదీన హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు అమలుచేయలేదంటూ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. పిటిషనర్ రామ్ రవికుమార్ బృందం దీప స్తంభంపై దీపం వెలిగించాలని, వారికి సీఆర్‌పీఎఫ్ బలగాలచే రక్షణ కల్పించాలని ఈ నెల 3వ తేది సాయంత్రం 6.30 గంటలకు ఆదేశాలు జారీ చేసింది. కానీ, వారిని అక్కడ భద్రతా విధులు చేపట్టిన పోలీసులు అడ్డుకున్నారు. ఈ కారణంగా వారు దీపం వెలిగించకుండా తిరుగుముఖం పట్టారు. అయితే సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌ను గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అనంతరం సాయంత్రం, తన ఉత్తర్వుల అమలుపై నివేదిక దాఖలుచేయాలని అధికారులను న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ ఆదేశించారు. పిటిషన్‌దారులు రామ్ రవికుమార్ బృందం దీపం వెలిగించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నగర పోలీసు శాఖ చేపట్టాలని, ఈ విషయమై శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నివేదిక దాఖలుచేయాలని మదురై నగర పోలీసు కమిషనర్ లోకనాథన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ క్రమంలో, కోర్టు ధిక్కరణ కేసు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విచారణకు వచ్చింది. ఆ సమయంలో, మదురై నగర పోలీసు కమిషనర్, జిల్లా కలెక్టర్, అధికారులు హాజరుకాలేదు. అనంతరం పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాదులు... కోర్టు మూడు సార్లు ఉత్తర్వులు జారీచేసినా కొండపై ఉన్న దీప స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతించలేదని తెలిపారు. అదే సమయంలో, దీపం వెలిగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన వందలాదిమందిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కుటిల రాజకీయం చేస్తుందని ఆరోపించారు. అందువల్ల ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని, కొండ శిఖరంపై దీపం వెలిగించేందుకు తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు. అనంతరం ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాదులు రవీంద్రన్, వీరరాఘవన్ వాదనలు వినిపిస్తూ.. కొన్నేళ్లుగా తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై దీపం వెలిగిస్తున్నట్లు, ఈ ఏడాది కూడా అదే ప్రాంతంలో దీపం వెలిగించామని, కానీ, ఆ ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో దీపం వెలిగించాలని కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. అదే సమయంలో, ఈ వ్యవహారంపై డివిజన్ బెంచ్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందని, ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు, ఈ కేసు విచారణ వాయిదావేయాలని అభ్యర్థించారు. దీంతో విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ స్వామినాథన్ ప్రకటించారు. అదే విధంగా తమ ఆదేశాలు అమలు చేకపోవడంపై నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

ధర్మాసనంలో అప్పీలు పిటిషన్

సింగిల్ జడ్జి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మదురై జిల్లా కలెక్టర్, ఎస్పీ శుక్రవారం హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, కేకే రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం ముందు అప్పీలు పిటిషన్ దాఖలుచేశారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తం చేయరాదని స్పష్టం చేసింది. అలాంటి వాటిని అనుమతించలేమని తేల్చి చెప్పింది. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో ఈ నెల 10వ తేది వరకు పిటిషన్లు దాఖలుచేయవచ్చని, ఈ తర్వాత దాఖలైన పిటిషన్లను అంగీకరించబోమని పేర్కొంది. ప్రభుత్వం తరఫున వచ్చిన అభ్యర్థన మేరకు, అన్ని పిటిషన్లను ఈ నెల 12వ తేదీన విచారించనున్నట్లు పేర్కొంది. పిటిషనర్లు, ప్రతివాదులు హైకోర్టు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా బహిరంగంగా మాట్లాడరాదని సూచిస్తూ.. తగిన ఉత్తర్వులు జారీచేయాలని న్యాయస్థానంపై ఒత్తిడి చేయవద్దని పేర్కొంది.

నాగేంద్రన్, హెచ్.రాజా సహా 153 మందిపై కేసు

తిరుప్పరంకుండ్రంలో గురువారం రాత్రి ఆందోళన చేపట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్, సీనియర్ నేత హెచ్.రాజా సహా 153 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం లేదంటూ బీజేపీ నేతలు గురువారం రాత్రి ఆందోళన చేపట్టగా, వారిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిపై ఏడు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు.

రేపు హిందూ మున్నని ఆందోళనలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఆందోళనలు చేపట్టనున్నట్లు హిందూ మున్నని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటేశ్వర సుబ్రమణియం తిరుప్పూర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... తిరుప్పరంకుండ్రంలో కార్తీక దీపం వెలిగించకుండా పోలీసులు అడ్డుకోవడం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. పిటిషనర్‌ను కూడా అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి కనిపిస్తోందన్నారు. డీఎంకే హిందువులకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తుందన్నారు. 178 ఆలయాలను డీఎంకే కూల్చివేసిందని, మైనార్టీ ఓట్ల కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వ తీరు, ప్రభుత్వానికి బానిసగా ఉన్న పోలీసుశాఖ తీరును ఖండిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సమాచార దృష్టి

మేట్టుపాళయం-ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూ ఇయర్, పొంగల్, రిపబ్లిక్ డే సందర్భంగా మేట్టుపాళయం-ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైళ్లు నడుపనున్నారు. ఈమేరకు సేలం రైల్వే డివిజన్ విడుదల చేసిన ప్రకటనలో.. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం నుంచి నీలగిరి జిల్లా ఊటీకి కొండ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఊటీ వచ్చే పర్యాటకులు కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో, క్రిస్మస్, న్యూ ఇయర్, పొంగల్, రిపబ్లిక్ డే సందర్భంగా మేట్టుపాళయం-ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైళ్లు నడుపనున్నారు. ఆ ప్రకారం, మేట్టుపాళయం నుంచి ఈనెల 25,27,29,31, జనవరి 2,4,15,17,23,25 తేదీల్లో ప్రత్యేక కొండ రైలు నడుపనున్నారు. ఈ రైలు మేట్టుపాళయం నుంచి ఉదయం 9.10 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.25 గంటలకు ఊటీ చేరుకుంటుంది. మరుమార్గంలో, ఊటీ నుంచి మేట్టుపాళయంకు ఈ నెల 26,28,30, జనవరి 1,3,5,16,18,24,24 తేదీల్లో ప్రత్యేక కొండ రైళ్లు నడపనున్నారు. ఈ రైలు ఊటీ నుంచి ఉదయం 11.25 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.20 గంటలకు ఊటీ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

కోనియమ్మన్ ఆలయాన్ని సందర్శించే భక్తులకు డ్రెస్ కోడ్

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన పెరియకడై వీధి కోనియమ్మన్ ఆలయానికి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఈ ఆలయ రథోత్సవం వచ్చే మార్చిలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో, ఆలయానికి వచ్చే భక్తులు సక్రమమైన దుస్తులు ధరించకపోవడంతో, ఇతర భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదులు పరిశీలించిన దేవాదాయ శాఖ, ఆలయానికి వచ్చే భక్తులకు డ్రెస్ కోడ్ అమలుచేసింది. ఆ ప్రకారం, పురుషులు పంచె లేదా ప్యాంట్, చొక్కా ధరించాలి. మహిళలు చీర, స్కార్ఫ్ లేదా చుడిదార్‌తో పాటు దుపట్టా ధరించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆలయం ప్రవేశ ద్వారంలో డ్రెస్ కోడ్‌కు సంబంధించి ప్రకటన బోర్డు ఏర్పాటుచేసినట్లు, ఈ ఉత్తర్వుల అమలుకు భక్తులు సహకరించాలని దేవాదాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

నేటినుంచి వృద్ధులకు రేషన్ సరుకులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'ముఖ్యమంత్రి తాయుమానవర్' పథకంలో, 65ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకేవెళ్లి రేషన్ సరుకులు అందజేస్తున్నారు. ఆప్రకారం,ఈనెల రేషన్ సరుకులు శనివారంనుంచి ఈనెల 10వతేదీవరకు అందించనున్నట్లు సహకారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కళాశాలల్లో శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారం దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతి కలిగించింది. ఈ ఘటన అనంతరం, కళాశాలల ప్రాంగణాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలకు సంబంధించి ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో వివరాలు ఇలా ఉన్నాయి... విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రవేశ ద్వారాల సంఖ్యను పరిమితం చేయాలి, ప్రహరీ గోడల ఎత్తు పెంచాలి, కళాశాలల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి, విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో శిక్షణ పొందిన సెక్యూరిటీ గార్డులను నియమించాలి, సెక్యూరిటీ గార్డులకు వాకీటాకీలు అందించవచ్చు, స్థానిక పోలీసుల సహకారంతో ప్రతి మూడు నెలలకు భద్రతా ఏర్పాట్లపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వుల్లో తెలియజేసింది.

కోవలంలో నూతన జలాశయం ఏర్పాటుకు అనుమతి

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కోవలంలో నూతన జలాశయం ఏర్పాటుకు తమిళనాడు కోస్టల్ జోన్ రెగ్యులేటరీ అథారిటీ అనుమతులు జారీచేసింది. రాజధాని నగరం చెన్నై వాసులకు పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, తేర్వాయ్ కండ్రిగ తదితర ఐదు జలాశయాల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. నగరంలో ఉద్యోగం, ఉపాధికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరగడంతో నీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయి. నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా కొత్త జలాశయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, కోవలంలో 4,375 ఎకరాల్లో రూ.471 కోట్ల వ్యయంతో 1.6 టీఎంసీల సామర్థ్యం కలిగిన జలాశయాన్ని నిర్మించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు, కోవలంలో 6వ రిజర్వాయర్ ఏర్పాటుకు అనుమతులు లభించాయని ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు.

నాగై-శ్రీలంక నౌకా సేవలు తాత్కాలిక రద్దు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంకలోని కాంగేశన్ హార్బర్‌కు 'శుభం' సంస్థ ప్యాసింజర్ నౌకా సేవలు అందిస్తోంది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో గత నవంబరు నెల పూర్తిగా నౌకా సేవలు నిలిపివేసి, డిసెంబరు మొదటి వారం నుంచి మళ్లీ నౌక సేవలు ఉంటాయని ఆ సంస్థ గతంలో ప్రకటించింది. ఈనేపథ్యంలో, ఇటీవల సంభవించిన 'దిత్వా' తుపాను కారణంగా కాంగేశన్ హార్బర్ తీవ్రంగా దెబ్బతినింది. ప్రస్తుతం ధ్వంసమైన హార్బర్ మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కారణంగా, తదుపరి తేదీ ప్రకటించేవరకు నౌకా సేవలు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆ సంస్థ ప్రకటన విడుదల చేసింది.

విమాన ఛార్జీలకు రెక్కలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ విమాన సేవలు స్తంభించడంతో, విమాన ఛార్జీలు పలు రెట్లు పెరిగాయి. ఆ ప్రకారం, నగరం నుంచి బెంగళూరు విమాన ఛార్జీ రూ.3,129 ఉండగా, ప్రస్తుతం రూ.20,599కి పెరిగింది. అలాగే, నగరం నుంచి తిరుచ్చికి రూ.3,129గా ఉన్న ఛార్జీ రూ.14,961, తిరువనంతపురానికి రూ.6,805గా ఉన్న ఛార్జీ రూ.34,403కు పెరిగింది. ఇక, నగరం నుంచి ముంబైకి రూ.5,980 ఛార్జీ ఉండగా, రూ.42,448, ఢిల్లీకి రూ.7,746గా ఉన్న ఛార్జీ రూ.32,782కు పెరిగింది. విమాన ఛార్జీలు హఠాత్తుగా పలు రెట్లు పెంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కేంద్ర ప్రభుత్వంపై రైతుల కన్నెర్ర

రైల్‌రోకో చేపట్టిన వందలాదిమంది అరెస్ట్ ● తంజావూరులో ఉద్రిక్తత



రైల్‌రోకోలో రైతులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెకెదాటు ఆనకట్ట ప్రాజెక్ట్ కోసం ముసాయిదా నివేదిక సమర్పించడానికి కర్ణాటక ప్రభుత్వానికి అనుమతించే సుప్రీంకోర్టుతీర్పును, కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తంజావూరులో శుక్రవారం రైల్‌రోకో చేపట్టారు. తమిళనాడు కావేరి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పనియప్పన్ నేతృత్వంలో పలు రైతు సంఘాల నేతలు ఉదయం తంజావూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే రైల్వేస్టేషన్‌ముందుకు బారికేడ్లు ఏర్పాటుచేసిన పోలీసులు బందోబస్తు విధులు చేపట్టారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన రైతులు, బారికేడ్లు దాటుకుని రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించారు. ఆసమయంలో తిరుచ్చినుంచి చెన్నైవైపుకు బయల్దేరేందుకు చోళన్ ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా ఉంది. రైతులు ఒక్కసారిగా రైలింజన్ ముందున్న పట్టాలపై బైఠాయించి రైల్ రోకో చేపట్టారు. మెకెదాటు ఆనకట్ట నిర్మించేందుకు అనుమతించమని, ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని రైతు సంఘాల నేతలు ఆరోపించారు. అలాగే, మెకెదాటు ఆనకట్ట నిర్మితమైతే తమిళనాడు ఎడారిగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్‌రోకో విరమించాలని రైతు సం ఘాల నేతలను పోలీసులు కోరినా, రైతులు రైల్ రోకో కొనసాగించారు. దీంతో,సుమారు 100మందికిపైగా రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన కారణంగా చోళన్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది.

నేడు పనిచేయనున్న పాఠశాలలు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలోని పాఠశాలలు శనివారం యథావిధిగా పనిచేస్తాయని జిల్లా ప్రధాన విద్యాశాఖ అధికారి కార్యాలయం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు ప్రతి శనివారం సెలవు ఇస్తున్నారు. ఈ క్రమంతో, దిత్వా తుపాను కారణంగా గత ఆదివారం నుంచి గురువారం వరకు చెన్నై జిల్లా పరిధిలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ సెలవులు భర్తీచేసేలా శనివారం పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యాశాఖ తెలిపింది.

జయకు ఘన నివాళులు



జయలలిత విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే పార్టీ నిర్వాహకులు

తిరుత్తణి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా అన్నాడీఎంకే శ్రేణులు ఆమెకు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుత్తణిలోని చిత్తూరు రోడ్డు వద్దనున్న జయలలిత విగ్రహానికి అన్నాడీఎంకే మాజీ ఎంపీ జి.హరి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం వృద్ధాశ్రమానికి వెళ్లి అల్పాహారం పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు కమలా థియేటర్, బస్టాండు, అరక్కోణం రోడ్డు ప్రాంతాల్లోని పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలూరులో...



నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం వేలూరులోని రాజా థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి అప్పు పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పేదప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే ఐటీ విభాగ కార్యదర్శి సతీష్‌కుమార్, నిర్వాహకులు కన్నదాసన్, జయశంకర్, అరివరసన్, వినోద్, యువరాజ్, దేవన్, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైగై డ్యాం నుంచి తాగునీరు విడుదల

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైగై డ్యాం నుంచి మూడు జిల్లాలకు శుక్రవారం నుంచి తాగునీరు విడుదల చేశారు. తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని 71 అడుగుల సామర్థ్యం కలిగిన వైగై డ్యాం నుంచి మదురై, తేని, దిండుగల్, రామనాథపురం, శివగంగ తదితర జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తుంటారు. తేని జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంకు నీటి రాక అధికమై, నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 64 అడుగుల నీటిమట్టాలు కలిగిన ఈ డ్యాం నుంచి శివగంగ, విరుదునగర్, రామనాథపురం జిల్లాలకు తాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం ఉదయం మూడు జిల్లాల తాగునీటి కోసం సెకనుకు 650 ఘనపుటడుగుల నీరు విడుదల చేశారు. డ్యాం నుంచి మూడు జిల్లాల తాగునీటి కోసం 8 రోజులపాటు 450 మిలియన్ ఘనపుటడుగుల నీరు విడుదల చేయనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

టాస్మాక్ ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న టాస్మాక్ ఉద్యోగులు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై రాష్ట్రప్రభుత్వం అదనపు పనిభారాన్ని పెంచుతుందంటూ శుక్రవారం ఉదయం టాస్మాక్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘ అధ్యక్షుడు శరవణన్ నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో టాస్మాక్ ఉద్యోగులంతా పనులు బహిష్కరించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శరవణన్ మాట్లాడుతూ, తమపై పనిభారం పెంచి వేతనాలు మాత్రం పెంచడంలేదని, అదేవిధంగా టాస్మాక్ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మునిరత్నం, నిర్వాహకులు ఏలుమలై, నాగరాజ్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై జిల్లాలో 15 లక్షల ఓట్ల తొలగింపు...?

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలో సుమారు 15 లక్షల ఓట్లు తొలగించనున్నట్లు సమాచారం. చెన్నై జిల్లా పరిధిలోని 16 శాసన సభ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులు గత నెల 4వ తేదీన ప్రారంభించారు. 3,718 మంది పోలింగ్ స్టేషన్ అధికారులను నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జి, పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో, లెక్కింపు ఫారాలు పొందే అంశంపై గురువారం స్థానిక రిప్పన్ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంకే, ఎండీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం సహా 12 గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ... చెన్నై జిల్లాలోని 40.04 లక్షల ఓటర్లలో 39.59 మందికి లెక్కింపు ఫారాలు అందజేశామన్నారు. వారిలో 22.79 లక్షల మంది నుంచి ఫారాలు పొందామని తెలిపారు. వారిలో 2.23 లక్షల మంది రెండు ఓట్లు కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే, 1.49 లక్షల మంది మృతిచెందిన జాబితాలో ఉన్నారని తెలిపారు. 8.39 లక్షల మంది శాశ్వతంగా వేరే నియోజకవర్గానికి మారారని, 36,979 మంది స్పందించలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ఈ గణాంకాల ప్రకారం 25.99 శాతం మంది ఫారాలు అందించలేదని తెలుస్తుందని, ఈ కారణంగా 10.40ల లక్షల నుంచి 15 లక్షల మందిని ఓటర్ల జాబితాల నుంచి తొలగించే అవకాశముందని అధికారులు తెలిపారు.

డీఎంకే యువజన మహానాడు ఏర్పాట్ల పరిశీలన



వేదిక ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా వన్నియన్‌తాంగళ్ ప్రాంతంలో ఈ నెలాఖరులో నిర్వహించనున్న డీఎంకే యువజన విభాగం మహానాడు ఏర్పాట్లను డిప్యూటీ సీఎం ఉదయనిధి శుక్రవారం పరిశీలించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని డీఎంకే యువజన విభాగం నిర్వాహకులను ఉత్సాహపరిచే విధంగా నిర్వహించనున్న ఈ మహానాడులో 13 జిల్లాలకు చెందిన లక్షమందికి పైగా కార్యకర్తలు పాల్గొనే అవకాశముందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం తిరువణ్ణామలై జిల్లాలో నిర్మించిన ఎంకే స్టాలిన్ ఎకో టూరిజం పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఉదయనిధి డీఎంకే శ్రేణులతో కలిసి మహానాడు వేదిక ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆ ప్రాంగణంలో కనీస వసతులు కల్పించాలని, అక్కడక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు ఆయన సూచనలిచ్చారు.

పాత పింఛన్ విధానాన్నే అమలుపరిచాలి



నిరసనలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్నే అమలుపరచాలని డిమాండ్‌తో శుక్రవారం ఉదయం వేలూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సంఘ అధ్యక్షుడు మురుగన్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తమకు ఇస్తున్న నూతన పింఛన్ విధానం వద్దని, పాతవిధానాన్ని అమలుచేయాలని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో పనిచేసిన మాజీ ఉద్యోగులకు ఒకే విధమైన పింఛన్లను అందించాలని, ఉద్యోగం చేస్తూ మరణించిన వారి కుటుంబానికి రూ.5లక్షల పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. తమ కోరికలను నెరవేర్చకుంటే త్వరలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు నటరాజన్, కార్యదర్శి మాసిలమణి, వేలూరు మండల అధ్యక్షుడు దీనదయాళన్, కేవీ.కుప్పం అధ్యక్షుడు దీనదయాళన్, వీఆర్‌వో రాజా తదితరులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహం కోసం తీసుకున్న అప్పుకు సంబంధించి దంపతుల మధ్య ఏర్పడిన వాగ్వాదం హత్యకు దారితీసిన సంఘటన తిరువణ్ణామలై జిల్లా చెయ్యార్‌లో చోటు చేసుకుంది. చెయ్యార్ సమీపంలోని కీల్పలందై ప్రాంతానికి చెందిన వినాయగం (55), విజయ (52) అనే దంపతులకు కలిగిన ఇద్దరు కుమార్తెలలో పెద్దకుమార్తెకు ఇటీవల వివాహం జరిగి భర్తతో నివసిస్తోంది. కుమార్తె వివాహం కోసం తీసుకున్న అప్పును తిరిగి చెల్లించే విషయంలో భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారని తెలిసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 8.30గంటలకు భార్యాభర్తలు వాగ్వాదానికి దిగి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ సందర్భంగా ఆవేశానికి లోనైన విజయ ఇంట్లోని కత్తితో భర్తపై దాడికి పాల్పడడంతో, తీవ్రంగా గాయపడిన వినాయగం రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై అందిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విజయను అరెస్టు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

29న క్రిస్టియన్ యూనిటీ జూబ్లీ సమావేశం

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థామస్ మౌంట్ దివ్యక్షేత్రంలో ఈ నెల 29న క్రిస్టియన్ యూనిటీ జూబ్లీ సమావేశం నిర్వహించనున్నట్లు క్యాథలిక్ బిషప్‌లు, ఫాదర్లు పేర్కొన్నారు. అడయార్ జీసస్ కాల్స్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెయింట్ థామస్ మౌంట్ ఆలయ బిషప్ రెవ.డా. లారెన్స్ పయాస్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, విద్యా వైద్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న అన్ని క్రైస్తవ సంస్థల్లో ఐక్యత పెంపొందింపజేయాలన్న దృక్పథంతో యేసుక్రీస్తు శిష్యుల్లో ఒకరైన సెయింట్ థామస్ హత్యకు గురైన బాసలిక ప్రాంగణంలో ఈ నెల 29న ఎక్యుమీనికల్ జూబ్లీ సమ్మిట్-టాబర్ 2025ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు క్రైస్తవ మత గురువుల సందేశం, నూతన గీతాలాపన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. కో-ఆర్డినేటర్లుగా ఫాదర్లు మ్యాన్‌వెల్, మైకేల్, అర్పుదరాజ్, పాల్ బిట్టో, ఆంథోనిరాజ్, బెనడిట్ బర్నబాస్, రెవ.ఫాదర్ తంగరాజ్‌లు వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.



విలేఖరులతో మాట్లాడుతున్న క్యాథలిక్ బిషప్‌లు, ఫాదర్లు

కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రానికి
బాంబు బెదిరింపు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంలో బాంబు ఉంచినట్లు వచ్చిన బెదిరింపుతో పోలీసులు సుమారు 5 గంటలసేపు తనిఖీలు చేపట్టారు. తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలో తలా 1,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు అణు విద్యుదుత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయి. అలాగే, మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ కేంద్రంలో బాంబు ఉంచినట్లు గురువారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని డీజీపీ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు మెసేజ్ అందింది. కార్యాలయ అధికారుల ఉత్తర్వులతో కూడన్‌కుళం పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు 11.30 గంటలకు అణువిద్యుత్ కేంద్రానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. సుమారు 5 గంటలు సాగిన తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. గత నెలలో కూడా ఈ కేంద్రానికి బాంబు బెదిరింపు వచ్చింది.

పెంచిన ఆవు మృతి చెందిందని విద్యార్థి ఆత్మహత్య



సెంథిల్‌కుమార్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమతో పెంచుకున్న ఆవు మృతిచెందడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విరుదునగర్ జిల్లాలో చోటుచేసుకుంది. మైలిఇలుపకుళం గ్రామానికి చెందిన పాండి కుమారుడు సెంథిల్‌కుమార్ (18) ప్రభుత్వ ఐటీఐలో మెకానికల్ చదువుతున్నాడు. అతనికి ప్రతినెలా వస్తున్న స్కాలర్‌షిప్‌ను పొదుపుచేసి 'సెమ్మరి' ఆవును కొనుగోలు చేసి సంరక్షిస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షానికి ఆవు మృతిచెందింది. తాను ప్రేమగా పెంచుకున్న ఆవు మృతిచెందడంతో సెంథిల్‌కుమార్ తీవ్ర మనస్తాపం చెందాడు. ఘటన జరిగిన రోజున సెంథిల్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సలకు మదురై ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సలు ఫలించక సెంథిల్ కుమార్ మృతిచెందాడు. ఈ ఘటనపై నరికుడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో వినూత్న శిక్ష

● ప్రభుత్వాస్పత్రి ఐసీయూలో మూడేళ్లు పనిచేయాలని తీర్పు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి హత్యకేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న ఓ వ్యక్తిని మూడేళ్లు ప్రభుత్వాసుపత్రిలోని అత్యవసర చికిత్సా విభాగంలో సేవలందించాలని తూత్తుకుడి బాలల కోర్టు వినూత్న శిక్ష విధించింది. వివరాలిలా వున్నాయి... తూత్తుకుడి జిల్లా కుళత్తూర్ సమీపంలోని శ్రీవైకుంఠపెరుమాళ్ పురానికి చెందిన సుబ్బయ్య గత 2008 ఆగస్టు 14న హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన మురుగన్, మునియస్వామి, 17 ఏళ్ల మైనర్ బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును 2010లో విచారించిన తూత్తుకుడి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు మురుగన్, మునియస్వామిలకు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. ఈ కేసులో మరో నిందితుడు 17 ఏళ్ల మైనర్ బాలుడి విచారణ తూత్తుకుడి బాలల ట్రిబ్యునల్‌లో జరిగింది. ఆకేసు విచారణ ఎట్టకేలకు ముగియడంతో గురువారం ట్రిబ్యునల్ ఛైర్మన్ భాగ్యరాజ్, సభ్యులు శరవణన్, ఉమాదేవి... హత్యలో పాల్గొన్నప్పుడు మైనర్‌గా వున్నందున ఇప్పుడు అతడు మూడేళ్లు తూత్తుకుడి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలోని అత్యవసర చికిత్సావిభాగంలో ఉదయం8నుంచి సాయంత్రం 4గంటలవరకు పనిచేయాలని ఆదేశించారు. బాలుడిరాకను వైద్యఅధికారి పర్యవేక్షించి నెలవారీ నివేదికను ట్రిబ్యునల్‌లో దాఖలుచేయాలని తీర్పు వెలువరించారు. కాగా, అప్పటి మైనర్ బాలుడికి ప్రస్తుతం 34 ఏళ్లు కావడం గమనార్హం.

తిరునల్వేలిలో 300 కిలోల హల్వా స్వాధీనం

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి అంటేనే హల్వా గుర్తుకు వస్తోంది. ఈ పట్టణం మీదుగా వెళ్లే ప్రయాణికులు, ఆ ప్రాంతంలో ఆగి హల్వా కొనుగోలు చేస్తుంటారు. నాణ్యత, రుచిలో తిరునల్వేలి నెయ్యి హల్వా ప్రత్యేక పేరు పొందింది. ఈ క్రమంలో, హల్వాలో నాణ్యత లోపించిందని పలువురు ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో అధికారులు శుక్రవారం పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నెయ్యి హల్వా అని విక్రయిస్తుండగా, నెయ్యికి బదులుగా డాల్డాతో తయారుచేసినట్లు అధికారుల పరిశీలనలో తెలిసింది. అలా తయారుచేసిన 300 కిలోల హల్వాను స్వాధీనం చేసుకున్న అధికారులు, ఆరు దుకాణాలకు సీలు వేశారు.

కొండల్లో చిక్కుకున్న పోలీసులను రక్షించిన యువకులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌడీని బంధించేందుకు వెళ్లి కొండలో చిక్కుకున్న ఐదుగురు పోలీసులను స్థానిక యువకులు రక్షించారు. తెన్‌కాశి జిల్లా కడయం సమీపంలో ఓ రౌడీని బంధించేందుకు ఐదుగురు పోలీసులు వెళ్లారు. వారు సమీపంలో ఓ చిన్న కొండ ఎక్కిన సమయంలో, ఈ ప్రాంతంలో భారీవర్షం కురిసింది. కొండపై ఏర్పడిన వరద ఉధృతిలో రాళ్లు, మట్టి చెరియలు విరిగి పడుతుండడంతో, మరో ప్రాంతానికి వెళ్లిన పోలీసులు కొండల్లోని దట్టమైన అడవుల మధ్య చిక్కుకుపోయారు. రౌడీని బంధించేందుకు వెళ్లిన పోలీసులు తిరిగి రాకపోవడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని గాలించారు. ఈ నెల 4వ తేది మధ్యాహ్నం ప్రారంభమైన గాలింపు గురువారం రాత్రి 11 గంటల వరకు చేపట్టినా పోలీసుల జాడ కనుగొనలేకపోయారు. ఈ క్రమంలో, స్థానిక యువకులతో వెళ్లిన పోలీసులు, కొండ ప్రాంతంలో చిక్కుకున్న పోలీసులను శుక్రవారం ఉదయం సురక్షితంగా రక్షించి దిగువకు తీసుకొచ్చినట్లు జిల్లా పోలీసు శాఖ తెలిపింది.

వైభవంగా శివాలయంలో దీప పూజ



దీప పూజలో భక్తులు

పెరంబూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూడలూరు తామరైకుళం శివాలయంలో 1008 దీప పూజ వైభవంగా జరిగింది. తేని జిల్లా తామరైకుళంలో 17వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ఉంది. శిథిలమైన ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. అదే సమయంలో, ఆలయంలో ప్రత్యేక పూజ, దీప పూజ, అన్నదానం జరుగుతున్నాయి. కార్తీక దీపోత్సవాల్లో భాగంగా గురువారం, వర్షం కురవాలి, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుతూ 1008 దీపాల పూజ జరిగింది. ఈ సందర్భంగా వాస్తు హోమం, తిరుమురై పారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగం తదితరాలు నిర్వహించారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

ధాన్యం స్టోరేజ్ కేంద్రంలో కలెక్టర్ పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అనైకట్టు సమీపంలోని పళ్లికొండలోని చిన్నతరహా ధాన్యం స్టోరేజ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల వద్ద ధాన్యం స్టోరేజీకి సంబంధించిన రికార్డును ఆమె పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు వ్యవసాయశాఖ అధికారి తెన్‌మొళి, మార్కెటింగ్ డైరెక్టర్ కలైసెల్వి సహా ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు తిరుత్తణిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుత్తణి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా శనివారం తిరుత్తణిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పళ్లిపట్టు, పొదటూరుపేట, అతిమాంజేరిపేట, కర్లంబాక్కం, పెరుమాళ్ నల్లూరు, కోనసముద్రం, నెడియం, చాణకుప్పం, కొళత్తూరు, పున్నియం, సొరకాయపేట, మేళపూడి, ఆర్కేపేట, అమ్మవారికుప్పం, సౌత్‌సెల్లత్తూరు, కథనగరం, జనకరాజుకుప్పం, బాలాపురం, ఆర్‌ఎంకుప్పం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఆర్కేపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.



తరుణి

తల్లిదండ్రులు చేపట్టిన వృత్తుల పట్ల పిల్లలకు అభిరుచి కలగడం, వారికి ఆ వృత్తుల్లో కొనసాగాలన్న తలంపు కలగడం సహజం. అయితే విభిన్నంగా ఆలోచించే వారు తల్లిదండ్రుల వృత్తులపట్ల ఆసక్తిచూపక వినూత్నంగా వేరొక వృత్తి అవలంబించాలనుకుంటున్నారు. ఆ కోవకే చెందుతారు డాక్టర్ లక్ష్మీకురుప్. కుటుంబంలో ఎక్కువమంది అడ్వకేట్లుగా, పారిశ్రామిక వేత్తలుగా ఉండటం చూసిన ఆమె, వారికి భిన్నంగా డాక్టర్ కావాలనుకున్నారు. ఆ దిశగా తన చదువును సాగించి, ఈ.ఎన్.టి. స్పెషలిస్ట్‌గా, సర్జన్‌గా ఎంతోమంది బాధితుల సమస్యలకు పరిష్కారంగా నిలిచారు. ఆమె వైద్యప్రస్థానం నేటి మన 'తరుణి'లో....

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



వృత్తిలో మమేకం.. వైద్యంలో కౌశలం

● డాక్టర్ లక్ష్మి ఆర్.కురుప్

పుట్టింది మలయాళీ కుటుంబమే అయినా మెట్టింది మాత్రం తెలుగు లోగిలిలోనే. భర్త, అత్త, మామ, కుటుంబ సభ్యులంతా తెలుగే మాట్లాడటంతో ఆమె కూడా తెలుగు భాషలో పట్టుసాధించారు. డాక్టర్ లక్ష్మి జన్మస్థలం కేరళ రాష్ట్రంలోని 'కొల్లమ్'. తండ్రి రవీంద్ర కురుప్ వ్యాపార వేత్త. తల్లి శ్రీదేవి అడ్వకేట్. లక్ష్మికి ఒక సోదరి ఉన్నారు. లక్ష్మి పాఠశాల విద్యాభ్యాసం 'అంచల్'లోని సెంట్రల్ స్కూల్‌లో 10వ తరగతి వరకు, ఆపై 11, 12వ తరగతులు త్రివేండ్రంలోని 'సెయింట్ థామస్ సెంట్రల్ స్కూల్'లో చదివారు. ఎంబీబీఎస్ 'కొచ్చిన్'లోని 'అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్'లో పూర్తి చేసి చెన్నైలోని 'గవర్నమెంట్ కీల్పాక్ మెడికల్ కాలేజీ' నుంచి ఎమ్.ఎస్, ఈ.ఎన్.టి. డిగ్రీ అందుకున్నారు. ఇంకా డి.ఎం.బి (ఇ.ఎన్.టి) చేశాక, యాంటీరియర్ అండ్ వెంట్రల్ స్కల్ బేస్ సర్జరీలో 'ఫెలోషిప్' సాధించారు.

వృత్తి అనుభవం.... :

కొంతకాలం కేరళ రాష్ట్రం కొల్లమ్‌లోని 'గవర్నమెంట్ తాలూకా హాస్పిటల్, మరి కొంత కాలం ఈఎస్ఐసీ హాస్పిటల్‌లో పనిచేశారు లక్ష్మి. అనంతరం స్థానిక తేనాంపేటలోని అపోలో కేన్సర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సేవందించారు లక్ష్మి. ప్రస్తుతం ఆమె చెన్నైలోని జి.ఎస్.టి రోడ్డు పల్లావరం చెన్నై హెడ్ అండ్ నెక్ ఇ.ఎన్.టి. స్పెషాలిటీ సర్జికల్ సెంటర్ (చెస్) హాస్పిటల్‌లో డైరెక్టర్‌గా, సీనియర్ కన్సల్టెంట్‌గాను, రేలా హాస్పిటల్, సుగమ్ హాస్పిటల్‌లలో విజిటింగ్ కన్సల్టెంట్‌గా (ఇ.ఎన్.టి అండ్ స్కల్ బేస్ సర్జరీ)వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా కామాక్షి, కావేరి హాస్పిటల్స్‌కు కూడా విజిటింగ్ కన్సల్టెంట్‌గా వెళుతుంటారు డాక్టర్ లక్ష్మి. ఆమె దేశ, విదేశాలలో ఎన్నో పత్ర సమర్పణలు గావించారు. తన ప్రొఫెసర్‌తో కలిసి 'బ్లాక్ ఫంగస్'కి సంబంధించిన పుస్తకం రాశారు. డా.లక్ష్మి 'వర్టిగో' ఇంకా నడకలో నిలకడకు సంబంధించి విస్తృతమైన శిక్షణ తీసుకున్నారు. సర్జరీలో కూడా కఠినమైన శిక్షణ పొందారు. భర్త డాక్టర్ సంజయ్‌కుమార్ చెన్నైలోని గవర్నమెంట్ రాయపేట్ హాస్పిటల్‌లో ఈ.ఎన్.టి. ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎక్కువ దూరం కారు డ్రైవ్ చేసుకొని వెళ్లడమంటే చాలా ఇష్టమని లక్ష్మి తెలిపారు. సర్జరీలు నిర్వహించడం పట్ల ఆమెకు ఎంతో ఆసక్తి.

వ్యక్తిత్వం...

బాల్యం నుండే సొంత వ్యక్తిత్వం అలవడడం కారణంగా తను విభిన్నమైన వృత్తిలో ప్రవేశించాలనుకున్నారు లక్ష్మి. పట్టుదలతో చదివి తను ఆశించిన వైద్యరంగంలో అడుగుపెట్టి చిన్నవయసులోనే పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. వృత్తినే దైవంగా భావించుకొని ఆమె ఎక్కువసేపు రోగులతో గడుపుతారామె. సహనంగా వారి సమస్యలు తెలుసుకొని తదనుగుణంగా స్పందించి చికిత్సనందిస్తారు. వర్టిగో రుగ్మత గురించి ఎంతో పరిశోధన చేశారు. గట్టి శిక్షణ తీసుకున్నారు. ఎంతోమందికి వర్టిగో సమస్యనుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. తన దగ్గరకి వచ్చిన పేషెంట్లు తిరిగి ఆనందంగా వెళ్ళడం ఎంతో తృప్తినిస్తుందని ఆమె తెలిపారు. తను నిత్య విద్యార్థినని, నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని చెప్పే మాటలు ఆమె వినమ్రతకు తార్కాణాలు. వైద్యవృత్తి అమూల్యమని, రోగుల జబ్బులను నయం చేసినప్పుడు కలిగే ఆనందం అనిర్వచనీయమని, దానిని డబ్బుతో కొనలేమని చెప్పారు లక్ష్మి. సర్జరీ ఒత్తిడితో కూడుకున్న పనే అయినా, అతి జయప్రదంగా పూర్తిచేసినప్పుడు సంతోషంతో మనసు తేలికవుతుందని, సంతృప్తిగా అనిపిస్తుందన్నారు. వైద్యవృత్తిలో అంకితభావం, కార్యదీక్ష, ప్రేమ ఉన్నప్పుడే వారు మంచి వైద్యులుగా రాణిస్తారు అన్నారు డాక్టర్ లక్ష్మి. మహిళలు వైద్యవృత్తిలో ఉన్నప్పుడు కుటుంబ సహకారం తప్పనిసరిగా ఉండాలంటూ తన జీవన సహచరుడు తనకి అన్ని విధాలా తోడ్పాటునందిస్తాడని, వృత్తిపరంగా సలహాలు, సూచనలు ఇవ్వడంతో బాటు, కుటుంబ బాధ్యతలలో కూడా తనకి తోడు నీడగా ఉంటాడని చెప్పారు. డాక్టర్ లక్ష్మి "తరుణి"తో సంభాషిస్తూ... ఎవ్వరూ సొంతవైద్యం చేసుకోరాదని, వైద్యుల సలహాల మేరకే నడుచుకోవాలని సూచించారు. శ్రవణేంద్రియాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెవుల్లో నీరు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



డాక్టర్ లక్ష్మి కుటుంబం

చిత్రజ్యోతి

'మాయబింబం' పోస్టర్ విడుదల

సెల్ఫ్ స్టార్ట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై కేజే సురేందర్ నిర్మించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మాయబింబం'. కొత్త తారాగణం జానకి, ఆకాష్ ప్రభు, హరికృష్ణన్, రాజేష్, అరుణ్ కుమార్ తదితరులు నటిస్తున్నారు. కొత్త నటులు, నటీమణులు మాత్రమే కాకుండా సంగీత దర్శకుడు నందా, ఎడిటర్ వినోద్, సినిమాటోగ్రాఫర్ ఎడ్విన్ అంటూ సాంకేతిక సిబ్బంది కూడా పూర్తిగా కొత్తవారు. ఈ చిత్రంలోని పాటలను గేయ రచయితలు వివేకా, పద్మావతి రాశారు. 2005లో జరిగిన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం ఈ నెలాఖరులో విడుదల కానుంది. ఈ క్రమంలో, ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు సుందర్.సి విడుదల చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న దర్శకుడు సుందర్.సి


ఒకే నెలలో 32 చిత్రాల విడుదల



● తమిళ సినీ చరిత్రలో రికార్డు

ఒకే నెలలో 32 చిత్రాలు విడుదల చేసి, తమిళ సినీ పరిశ్రమ రికార్డు సృష్టించింది. కరోనా లాక్ డౌన్ అనంతరం ప్రతి సంవత్సరం తమిళ చిత్రాల సంఖ్య పెరుగుతోంది. ఆ ప్రకారం, 2024లో 241 చిత్రాలు విడుదలయ్యాయి. అప్పట్లో ఈ సంఖ్య ఎక్కువగా ఉండేది. ఈ నేపథ్యంలో, ఈ సంవత్సరం జనవరి నుంచి నవంబరు నెల వరకు 262 చిత్రాలు విడుదలయ్యాయి. (2024వ సంవత్సరంలో నవంబరు వరకు 220 చిత్రాలు మాత్రమే విడుదలయ్యాయి). సంవత్సరంలో చివరి నెల కావడంతో డిసెంబరు 20 నుంచి 25కు పైగా చిత్రాలు విడుదల కానున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఆ ప్రకారం, ఈ సంవత్సరం 280కి పైగా చిత్రాలు విడుదల రికార్డు సృష్టించనుంది. ఇదిలా ఉండగా, నవంబరు నెలలో మాత్రమే 32 సినిమాలు విడుదలయ్యాయి. వాటిలో అరోమామలే, అదర్స్, క్రిస్టినా కదిర్‌వేలన్, పగల్ కనవు, పరిసు, కాంతా, గుంకీ 2, సూదాట్టం, మిడిల్ క్లాస్, దీవ్యకులైనడుంగ, మాస్క్, రివాల్వర్, రీటా సహా 32 చిత్రాలు విడుదలయ్యాయి. ఈ సంవత్సరం తమిళ సినిమాలో కూడా ఒక రికార్డు అంటున్నారు. ఒకే నెలలో ఇన్ని సినిమాలు ఎప్పుడూ విడుదల కాలేదని తమిళ సినీ ప్రముఖులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

'జైలర్-2' చిత్రంలో షారూక్ ఖాన్....?



సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' విజయవంతమైన నేపథ్యంలో, ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'జైలర్-2' చిత్రాన్ని దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. గోవా సహా పలు ప్రాంతాల్లో ఈ చిత్ర షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రంతో రజనీకాంత్‌తో ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు, మేఘనారాజ్ తదితరులు నటిస్తున్నారు. అలాగే, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లు అతిథి పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం సమకూరుస్తుండగా, వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. అదే సమయంలో, ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. తొలుత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలోని 'కూలి' చిత్రంలో నటించేందుకు నటుడు షారూక్‌ను సంప్రదించగా, కొన్ని కారణాలతో ఆయన నటించలేదని సమాచారం. ఆయనకు బదులు మరో బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ అతిథి పాత్రలో నటించారు. ప్రస్తుతం, 'జైలర్-2' చిత్రంలో షారూక్ నటించనున్నారని, ఆయనకు సంబంధించిన సీన్లు వచ్చే మార్చి నెలలో షూట్ చేయనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ విషయమై అధికారపూర్వక ప్రకటన, ఈ నెల 12న రజనీ జన్మదినం రోజున వెలువడనుందని, అదే రోజున కమల్ హాసన్ నిర్మిస్తున్న 'తలైవర్-173' చిత్రం, ఆ చిత్ర దర్శకుడి గురించి ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాల సమాచారం.

తిరువణ్ణామలై జిల్లాలో ఎంకే స్టాలిన్ ఎకో టూరిజం పార్కు

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో తిరువణ్ణామలై-తిరుక్కోవిలూరు రహదారిలో హైటెక్ వసతులతో నిర్మించిన ఎంకే స్టాలిన్ ఎకో టూరిజం పార్కును డిప్యూటీ సీఎం ఉదయనిధి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర రహదారులశాఖ ఆధ్వర్యంలో సుమారు 33 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కు రూపుదిద్దుకుంది. ఇందులో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో నీరు నిలువకుండా వసతి కల్పించారు. పార్కు మధ్యనున్న స్థలంలో తవ్విన చెరువు గట్లను వెట్టివేలుతో సుందరంగా అలంకరించారు. అంతేకాకుండా వాకింగ్‌లో పాల్గొనేవారు అలసట చెందకుండా రెండు కిలోమీటర్ల దూరానికి ఆక్యుప్రెషర్ స్వభావం కలిగిన మార్గం ఏర్పాటైంది. చిన్నపిల్లల కోసం క్రీడా పరికరాలతో కూడిన గ్రౌండ్ అందుబాటులో ఉంచారు. పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా వ్యాయామ శిక్షణ పరికరాలతో జిమ్‌ను నిర్మించారు. ఈ ఎకో టూరిజం పార్కు ప్రాంగణంలో స్వదేశీ, విదేశీ పూల మొక్కలు నాటి శ్రద్ధగా సంరక్షిస్తున్నారు. ప్రజలు విశ్రాంతి పొందేందుకు పార్కులో 20కి పైగా షెల్టర్లను ఏర్పాటు చేశారు. మరీముఖ్యంగా ప్రజల భద్రతకోసం సీసీటీవీ కెమెరాలు పొందుపరిచారు. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతులు కూడా కల్పించారు. ప్రారంభోత్సవంలో ప్రజా పనులశాఖ మంత్రి ఏవీ. వేలు, డిప్యూటీ స్పీకర్ కె.పిచ్చాండి, ఎంపీలు అంజియార్ సెల్వరాజ్, అన్నాదురై, ఎంఎస్ ధరణివేందన్, ఎమ్మెల్యేలు ఎంపి.గిరి, అంబేద్కకుమార్, శరవణన్, డీఆర్‌వో రామ్‌ప్రదీప్, చీఫ్ ఇంజనీర్ ఆర్.కృష్ణస్వామి, కౌన్సిలర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎంకే స్టాలిన్ ఎకో టూరిజం పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

వడివుడయమ్మన్ ఆలయంలో కార్తీక మాస పూజలు

నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో సుమారు 2వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన వడివుడయమ్మన్ సమేత ఆదిపురీశ్వరర్ నిజరూప దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. త్యాగరాజ స్వామి సన్నిధి కలిగిన ఈ ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. తొండమండలంలో ప్రసిద్ధి చెందిన 32 శైవక్షేత్రాల్లో ఒకటైన ఈ ఆలయంలోని మూలవర్ శనివారం వరకు నిజరూప దర్శనంతో భక్తులను కటాక్షిస్తారు. ఈ మహాదర్శనం కోసం భక్తులు శుక్రవారం నుంచి క్యూలైన్లలో సుమారు 3 గంటలు వేచిఉండి మొక్కులు చెల్లించుకుంటున్నారు. సంవత్సరమంతా బంగారుపూత వెండి నాగకవచం అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్న స్వామివారు ఏడాదికి ఒకసారి పవిత్ర కార్తీకమాసంలోని మూడు రోజులు మాత్రం నాగకవచంతో పూజలందుకుంటారు. ఆ మేరకు ఈ ఏడాది ఉత్సవాలు గురువారం సాయంత్రం 6.30గంటలకు ప్రత్యేక పూజలతో ప్రారంభంకాగా, నాగకవచం అలంకారంలో భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుని పులకించిపోయారు. సీఎం స్టాలిన్ సతీమణి దుర్గా, హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.ఇదిలా వుండగా, శుక్ర, శనివారాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులను క్యూలైన్ల ద్వారా అనుమతిస్తారు. ఈ సందర్భంగా ఆదిపురీశ్వరునికి పుణుగు సాంబ్రాణి, తైలాభిషేకాలు నిర్వహిస్తారు. శనివారం రాత్రి 8 గంటల అనంతరం నిర్వహించనున్న అర్ధజాము పూజల తర్వాత స్వామివారిని నాగకవచంతో అలంకరిస్తారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో ఆలయ గోపురం-క్యూలైన్లలో వేచివున్న భక్తులు

రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగ్యూ

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వారం రోజులకు పైగా కురుస్తున్న వర్షం కారణంగా డెంగ్యూ వేగంగా వ్యాప్తిచెందుతోందని, ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆరోగ్యశాఖ సూచించింది. దిత్వా తుపాను ప్రభావం వల్ల చెన్నై సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. వర్షపునీరు చేరిన ప్రాంతాల్లో దోమలు, విష క్రిములు సంచరిస్తుండటంతో పలు జిల్లాల్లో డెంగ్యూ జ్వరంతో ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రోజుకు 100 నుంచి 180 మంది డెంగ్యూ బారిన పడుతున్నట్లు ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. డెంగ్యూ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మూడు రోజులు వరుసగా జ్వరంతో బాధపడుతున్నవారు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఆ శాఖ అధికారులు తెలిపారు. చెన్నై, కోయంబత్తూరు, తంజావూరు, మదురై, వేలూరు జిల్లాల్లో వ్యాప్తిచెందుతున్న డెంగ్యూని నివారించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రహదారులు, నివాస ప్రాంతాల్లో చేరిన వర్షపు నీటిని వెంటనే తొలగించి ఆ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, క్రిమి సంహారక మందులు చల్లాలని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, టౌన్ పంచాయతీలు, గ్రామ పంచాయతీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.



జయలలిత సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఓపీఎస్, వీకే శశికళ తదితరులు

మళ్లీ 'అమ్మ'పాలన రావాలి

● వీకే.శశికళ

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె స్నేహితురాలు వీకే.శశికళ, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ సహా వారి మద్దతుదారులు శుక్రవారం పెద్దసంఖ్యలో జయలలిత సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశికళ మీడియాతో మాట్లాడుతూ, చీలికలైన అన్నాడీంకే మళ్లీ ఏకమై అమ్మ ప్రభుత్వం ఏర్పాటు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల గెలుపే లక్ష్యంగా అమ్మ అభిమానులు పనిచేయాలని ఆమె సూచించారు. సినీ రాజకీయ రంగాల్లో చక్రం తిప్పిన ఎంజీఆర్, జయలలితలు నిర్ణయాలు తీసుకునే సమయంలో తొందరపడరని, ఆలోచించి వారు తీసుకున్న నిర్ణయాల వల్ల అన్నివర్గాల ప్రజలు లబ్ధిపొందారని తెలిపారు. ఈ నాలుగున్నరేళ్ల డీఎంకే ప్రభుత్వంలో రాష్ట్రంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. వర్షాకాలంలో జనజీవనం స్తంభించకుండా రోడ్లు, డ్రైనేజీల మరమ్మతుల కోసం సుమారు రూ.6,148కోట్లు ఖర్చుచేసినట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిందని, అయితే గత వారంరోజులుగా కురుస్తున్న వర్షానికి రాజధాని నగరంతో పాటు అన్ని జిల్లా కేంద్రాలు నీట మునిగాయని, దీన్నిబట్టి సీఎం స్టాలిన్ పాలన ఏపాటిదో ఇప్పటికే ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. తాజాగా తిరుప్పరంకుండ్రం ఆలయ వ్యవహారాన్ని అధికార డీఎంకే రాజకీయంగా మార్చిందని శశికళ వ్యాఖ్యానించారు.

సీఎం అభ్యర్థిగా ఈపీఎస్ ఉండే కూటమికి దూరం: టీటీవీ దినకరన్

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సీఎం అభ్యర్థిగా ఉండే కూటమికి తాను దూరంగా ఉంటానని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. జయ సమాధి వద్ద నివాళులర్పించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకేను కోట్లాది మంది కార్యకర్తలు నడిపిస్తున్నారని, ఈపీఎస్‌ను నేతగా ఎవరూ చూడడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల పొత్తుపై వచ్చే జనవరిలో నిర్ణయం తీసుకోనున్నట్లు దినకరన్ తెలిపారు.

తిరువణ్ణామలైలో ఘనంగా కార్తీక ఉత్సవాలు

● గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

వేలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వరాలయంలో గత నెల 24వ తేదీన ప్రారంభమైన కార్తీక దీపోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 11వ రోజైన శుక్రవారం తెల్లవారుజామున ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్‌ల ఉత్సవమూర్తులకు అందంగా పుష్పాలంకారం చేసిన పూజారులు ఆలయ మాఢవీధుల్లో వేదమంత్రోచ్చారణ, భక్తుల ఓంనమశ్శివాయ దివ్యనామస్మరణ, మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగించారు. అదేవిధంగా అరుణాచల గిరిప్రదక్షిణకు అనుకూల సమయం కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి ఆలయానికి విచ్చేసిన లక్షలాది మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో స్వామివారు - గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

న్యాయశాఖలో మతవాదం పెరగడం ప్రమాదం



పాదయాత్ర జెండాను ఆవిష్కరిస్తున్న వైగో

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): న్యాయశాఖలో మతవాదం పెరగడం ప్రమాదకరమని, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. స్థానిక ఎగ్మూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వైగో విలేకరులతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అడ్డుకోవాలి, కుల ఘర్షణలు పెరగకుండా శాంతిభద్రతలను కాపాడాలి.. తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా తాను వచ్చే జనవరి 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తిరుచ్చి నుంచి మదురై వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. తన పాదయాత్రను సీఎం స్టాలిన్ ప్రారంభిస్తారని, ప్రారంభ కార్యక్రమంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టనున్న పాదయాత్రం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు.

22న వాహనాల వేలం

● రాష్ట్ర పోలీసుశాఖ ప్రకటన



ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేసుల్లో పోలీసు శాఖ స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 22న వేలం వేయనున్నట్లు శుక్రవారం డీజీపీ కార్యాలయం ప్రకటించింది. ట్రాఫిక్ విభాగం పోలీసులు, ఎక్సైజ్ విభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా 30 ద్విచక్ర వాహనాలు, రెండు మూడు చక్రాల వాహనాలు, 30 మోటారు వాహనాలు, నాలుగు లారీలు, ఆరు పడవలు అని, 72 వాహనాల్లో తొలి విడతగా 48 వాహనాలను వచ్చే 22వ తేదీ ఉదయం 11 గంటలకు మదురైలో 24 వాహనాలు, 23వ తేదీ తిరుచ్చిలో మరో 24 వాహనాలు వేలం వేయనున్నారు. ఇందులో పాల్గొనదలిచినవారు వచ్చే ఆదివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు తిరుచ్చి, కన్నియాకుమారి, తేని, దిండుగల్, శివగంగ, మదురై, నాగపట్నం, కోయంబత్తూరు, సేలం, విల్లుపురం ప్రాంతాల్లోని ఎక్సైజ్ విభాగం కార్యాలయాలకు నేరుగా వెళ్లి వాహనాలను పరిశీలించవచ్చు. వేలంలో పాల్గొనేందుకు రూ.1000 ప్రవేశ రుసుము చెల్లించి టోకెన్లు పొందాల్సిందిగా డీజీపీ కార్యాలయం సూచించింది.



అక్కదేవతలకు కార్తీకపూజలు

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్ల గుడిలో ఏడుగురు అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగం ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. సారె సమర్పించారు. ఈ సందర్భంగా అక్కగార్ల ఆలయాన్ని పుష్ప, విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈకార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ట్రాన్స్‌పోర్టు డీఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

జనవరికల్లా అందుబాటులోకి బయోగ్యాస్‌ప్లాంట్



తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి 2026 జనవరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐఓసీఎల్ ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని డంపింగ్ యార్డు వద్ద ఐఓసీఎల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, ఘన వ్యర్థాల నిర్వహణపై పద్మావతి గెస్ట్‌హౌస్‌లో టీటీడీ, ఐఓసీఎల్ ప్రతినిధులతో శుక్రవారం అదనపు ఈవో సమీక్షించారు. గ్యాస్‌ప్లాంట్ ప్రాంగణంలో కాలుష్య ద్రవాల నివారణకు అదనపు గల్పర్ మెషిన్లు ఏర్పాట్లు చేయాలన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 51,082

తలనీలాలు సమర్పించినవారు: 19,836

సీనియర్ సిటిజెన్స్‌కు నేరుగా దర్శనాలు కల్పించండి



● 'డయల్ యువర్ టీటీడీ ఈవో'లో కోరిన భక్తులు

'మేము దివ్యాంగులం. ఐదు నెలలుగా ఆన్‌లైన్‌లో టోకెన్ల కోసం ప్రయత్నిస్తున్నా లభించడం లేదు.'

ఆన్‌లైన్‌లోనే ఇస్తే పాకుతూ ముందుకు సాగే మాలాంటి వాళ్లం ఎలా దర్శనం చేసుకోగలం,

'నాకు 64 ఏళ్లు. ఎంతకాలం ఉంటానో తెలీదు. మాలాంటివాళ్లకు తిరుమలలోనే కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం కల్పించండి.'

వృద్ధులు, దివ్యాంగులను ఆన్‌లైన్ బుకింగ్‌కి పరిమితం చేయకండి. నేరుగా వచ్చినా స్వామి దర్శనం కల్పించండి అని పలువురు భక్తులు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం ఫోన్‌ల ద్వారా ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కోరారు. ఇలా కోరిన వారిలో మహేశ్వరయ్య (వెంకటగిరి), వెంకటేశ్వరరావు (ఏలూరు), శ్రీనివాస్(చెన్నై), దుర్గాప్రసాద్(భీమవరం) ఉన్నారు. ఇందుకు.. గతంలో క్యూలైన్ విధానంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేయడంతోనే ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నామని బదులిచ్చారు.

గుడిలో 'యో.. పోయా..'లు వద్దు

అలాగే, నాదనీరాజనం వేదికపై గత తరహాలో భారతం, రామాయణం, అన్నమయ్య కీర్తనలు, గరుడపురాణ కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీనివాసులు(హైదరాబాద్), రవి(రాజమండ్రి) కోరగా, త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. టీటీడీ ఉద్యోగులు, శ్రీవారిసేవలను ఆలయంలో 'యో.. పోయా' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని, అలా కాకుండా గోవిందా అనేలా చర్యలు తీసుకోవాలని శివశంకర్(వైజాగ్) సూచన చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఈవో చెప్పారు.

స్థానికులకు అన్యాయం

వైకుంఠద్వార దర్శనాల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి) ఈవో దృష్టికి తీసుకెళ్లగా, తొలి మూడురోజుల్లో బయటవాళ్లే కాకుండా స్థానికులు కూడా టోకెన్లు పొందారని ఈవో చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒంటిమిట్టకు 50 ఏళ్ల మాస్టర్‌ప్లాన్

అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన శుక్రవారం సాయంత్రం అధికారులతో దీనిపై సమీక్షించారు. కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, ఆధ్యాత్మిక చిహ్నాలు, మ్యూజియం, డిజిటల్ స్క్రీన్లు, కళామందిరం, చెరువులో 108 అడుగుల జాంబవతుడి విగ్రహం, మాడవీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అనిల్‌కుమార్ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ఇంటి ముందు దిగాలుగా రాజమ్మ

పాపానాయుడుపేటలో పేలిన గ్యాస్ సిలిండర్

● ధ్వంసమైన ఇంటి గోడ, కిటికీలు, సామాన్లు

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ఓ ఇంట్లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో స్టోర్‌రూంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దెబ్బతినింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లకపోగా గృహోపకరణాలు, ఇంటి గోడ ధ్వంసమయ్యాయి. పాపానాయుడుపేటకు చెందిన రాజమ్మ భర్త పదేళ్ల కిందట, కుమారుడు ఐదేళ్ల కిందట మృతి చెందారు. ప్రస్తుతం ఈమె ఒంటరి మహిళ. ఈమె ఏడాదికి రెండు సార్లు సదాశివకోనకు వెళ్లి ఈశ్వరుడికి పూజలు చేసి అక్కడే భక్తులకు అన్నదానం చేస్తోంది. ఈ క్రమంలో ఈనెలలో కోనకు వెళ్లడానికి సరుకులు, గ్యాస్ సిలిండర్‌ను స్టోర్‌రూంలో పెట్టింది. గురువారం రాత్రి భోజనం చేసి వరండాలో పడుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు కాలి గోతాల మీద పడటంతో ప్లాస్టిక్ కాలిన వాసన రాజమ్మకు వచ్చింది. స్టోర్‌రూంలో మంటలు ఎగసిపడుతున్నట్లు గుర్తించి వెంటనే వెలుపలకు పరుగులు తీసింది. రాత్రి 11గంటలు కావడంతో రాజమ్మ పెట్టిన కేకలకు కొంతమందే బయటకు వచ్చారు. అప్పటికే ప్లాస్టిక్ కవర్లకు వ్యాపించిన మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలింది. ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పాపానాయుడుపేటకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో స్టోర్ రూం గోడలు బీటలు వారాయి. సరుకులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులు పాపానాయుడుపేటకు చేరుకుని విచారణ జరిపారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు తెలిపారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన పళని లక్ష్మణ్ 2016లో తిరుమల తుంబురతీర్థం వద్ద ఎర్రచందనం తరలిస్తూ అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేయగా.. అతడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. విచారణలో ఉన్న ఈ కేసును తాజాగా తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ వాదనలు వినిపించారు.



తిరుపతి కేంద్రంగా మొదలైన బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు క్రమంగా ఊపందుకుంటోంది. రాయలసీమ అభివృద్ధికి ఇది ఊతంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేధావివర్గం గొంతు కలుపుతున్నారు. బాలాజీ డివిజన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతి నుంచి ఢిల్లీదాకా డివిజన్ వాణి వినిపిస్తున్నారు. డివిజన్ సాధించేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. అందరూ కలిసిరావాలని పిలుపునిస్తున్నారు. బాలాజీ రైల్వే డివిజన్‌వల్ల మనకు కలిగే ప్రయోజనాలేమిటో కొందరు ప్రముఖుల అభిప్రాయాలు ఇవి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

● బాలాజీ రైల్వేడివిజన్ సాధించుకుందామని మేధావుల పిలుపు

సాధించి తీరుతాం



తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు ఇప్పటిది కాదు. మనకు ఎప్పుడో రావాల్సింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా, బాలాజీ డివిజన్ దారి మళ్లి గుంటూరుకు వెళ్లింది. ఈసారి ఎలాగైనా డివిజన్ సాధనే లక్ష్యంగా ముందుకు వెళతున్నాం. మన ఆవేదనను ఎంపీల దృష్టికి తీసుకెళుతున్నాం. త్వరలోనే పదిమందితో ఢిల్లీకి వెళ్లనున్నాం. డివిజన్ ఏర్పాటైతే 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన ఉంటుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వసతులు, ఫ్రైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి. రాష్ట్రానికి భౌగోళిక-ఆర్థిక సమతుల్యత తీసుకువస్తుంది. దీనిద్వారా రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడుల వృద్ధికి గట్టి పునాది ఏర్పడుతుంది.

- కుప్పాల గిరిధర్, కన్వీనర్, బాలాజీ రైల్వే డివిజన్ సాధనసమితి

కొత్తరైళ్లు వేసుకోవచ్చు



బాలాజీ డివిజన్ వస్తే తిరుపతి రూపురేఖలు మారిపోతాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుంది. 30 మంది సివిల్ అధికారులు వస్తారు. ఎగుమతి, దిగుమతుల ద్వారా వందల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. తిరుపతి నుంచి కొత్తకొత్త ప్రదేశాలకు రైళ్లు వేసుకోవచ్చు. రాయలసీమలో ఉండే ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంటుంది. పుటపర్తిని కలుపుకోవచ్చు. అన్ని పుణ్యక్షేత్రాలకు రైళ్లువేసుకోవచ్చు. తిరుపతి నుంచి నెల్లూరు, కాట్పాడికి లోకల్ ట్రైన్స్ వేసుకోవచ్చు.

- వేణుగోపాల్ రెడ్డి, సాధన సమితి నేత

సీమ ముఖచిత్రం మార్చవచ్చు



రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో గుంతకల్లు జోన్ అడిగాం. అది మరుగున పడింది. ఇప్పుడు కేవలం డివిజన్ మాత్రమే అడుగుతున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 70 డివిజన్లలో తిరుపతి ఎందుకు అడుగుతున్నామంటే డివిజన్ ఉంటే డీఆర్‌ఎం మనకు అందుబాటులో ఉంటారు. డివిజన్ ఏర్పాటు ద్వారా వెస్ట్ రైల్వే స్టేషన్, తిరుచానూరు రైల్వే స్టేషన్లు అభివృద్ధిచేసుకోవచ్చు. మదనపల్లి మీదుగా కడప, పీలేరు మీదుగా తాడిపత్రికి రైల్వే లైన్లు వేసుకోవచ్చు. పాకాల నుంచి పలమనేరు మీదుగా మరొక రైల్వే లైను వేయాలని డిమాండు ఉంది. డివిజన్ కల సాకారమయ్యే దిశగా తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చాలి.

- భూమన్, రాయలసీమ ఉద్యమ నేత

పార్టీలకతీతంగా ఉద్యమించాలి

పాతికేళ్ల ముందటి తిరుపతి వేరు, ఇప్పుడు వేరు. పెరిగిన జనాభా, రెట్టింపైన భక్తులు, విస్తరించిన పరిధి. విద్య, వైద్య సంస్థలు, పరిశ్రమలు పెద్దఎత్తున తిరుపతి జిల్లాకు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకుని చూస్తే బాలాజీ రైల్వే డివిజన్ అవసరం ఉందని అర్థమవుతుంది. పరిశ్రమలకు అవసరమైన ముడిసరకులు, తయారైన ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అవసరమైన రవాణా సులభతరం అవుతుంది. టూరిజంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పన మెరుగవుతుంది. కనెక్టివిటీ బాగుంటే అభివృద్ధి బాగుంటుంది. డివిజన్ సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుంది. రాయలసీమ మరింత అభివృద్ధి చెందుతుంది. పార్టీలకతీతంగా ప్రయత్నం చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది.



- డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాధనసమితి నాయకురాలు



గురువారం లెజండరీ నిర్మాత ఏవీఎం శరవణన్ మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుమారుడు ఎంఎస్ గుహన్, మనవరాలు అపర్ణను చెన్నైలో శుక్రవారం పరామర్శిస్తున్న ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యులు కమల్ హాసన్

జయ వర్ధంతి సందర్భంగా 1000 మందికి అన్నదానం



అన్నదానంలో సునీల్ బృందం

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి జయలలిత 9వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగ సంయుక్త కార్యదర్శి, ఉంగలుక్కాగ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ వి.సునీల్ 1000 మందికి అన్నదానం చేయడంతో పాటు పలువురికి వివిధ రకాల సహాయాలను అందించారు. శుక్రవారం ఉదయం స్థానిక టి.నగర్ శ్రీనివాస సాలైలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, సామాజిక సేవకులు పాల్గొన్నారు. డాక్టర్ సునీల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామియేనని, అందుకే ఆయన్ని మళ్లీ సీఎంను చేయాలని ప్రజలు నిశ్చయించుకున్నారని తెలిపారు. ఈపీఎస్ బహిరంగ సభలకు లక్షలాదిమంది ప్రజలు తరలిరావడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. వచ్చే ఏడాది రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం రాబోతోందని, ప్రజలు కష్టాలు తీరబోతున్నాయని సునీల్ పేర్కొన్నారు.

విద్యార్థినిని కారులో కిడ్నాప్ చేసిన యువకుడు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన కళాశాల విద్యార్థినిని కొద్దిగంటల్లోనే పోలీసులు రక్షించారు. స్థానిక మొగప్పేర్ వెస్ట్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి కళాశాలలో చదువుతోంది. ఆమెకు అదే ప్రాంతానికి చెందిన శ్యామ్‌సుందర్‌తో పరిచయం ఏర్పడింది. శ్యామ్‌సుందర్ నడవడికలు సక్రమంగా లేకపోవడంతో ఆ విద్యార్థిని అతనికి దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో, గురువారం రాత్రి విద్యార్థిని ఇంటి నుంచి దుకాణానికి వెళ్తున్న సమయంలో, కారులో వచ్చిన శ్యామ్‌సుందర్ ఆమెను కిడ్నాప్ చేశాడు. బాధిత విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదుతో చెక్‌పోస్టుల వద్ద పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. కారుకు అమర్చిన జీపీఎస్ ఆధారంగా దిండివనం చెక్‌పోస్ట్‌లో కారును అడ్డుకున్న పోలీసులు, విద్యార్థినిని రక్షించి, శ్యామ్‌సుందర్‌ను అరెస్ట్‌చేసి విచారిస్తున్నారు.

ఇంకా శివారును వీడని వాననీరు

● ఐదవరోజూ తప్పని అగచాట్లు

● పాములు సంచరిస్తుండడంతో భయాందోళనలు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాలను ఐదవ రోజైన శుక్రవారం కూడా వాననీరు వదల్లేదు. 'దిత్వా' తుపాను కారణంగా నగరం, శివారు ప్రాంతాల్లో గత ఆదివారం నుంచి భారీ వర్షాలు కురిశాయి. నగరంలోని రోడ్లు జలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని రోడ్లు, వీధుల్లోని నీటిని విద్యుత్ మోటార్ల సాయంతో కార్పొరేషన్ కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించినా, శివారులోని ముంపు ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. ముఖ్యంగా, తాంబరం, రెడ్‌హిల్స్, పుళల్, చుట్టుపక్కల ప్రాంతాల్లో మోకాలి లోతున నీరు నిలిచే ఉంది. తాంబరం సమీపంలోని ఊరపాక్కం, పరిసర ప్రాంతాలు కూడా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మాధవరం నియోజకవర్గం పరిధిలోని పుళల్ పంచాయతీ యూనియన్ పరిధిలోని పలు ప్రాంతాలు కూడా ఐదవ రోజు వరద నీటితో చిన్న చెరువులను తలపిస్తున్నాయి. ఆళింజివాక్కం ప్రాంతంలోని ముత్తుకుమరన్ నగర్, న్యూ స్టార్ సిటీ, కల్మేడు ప్రాంతంలోని మరో న్యూ స్టార్ సిటీ ప్రాంతాల్లోని గృహాలు వరద నీటిలోనే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పుళల్ నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాల తగ్గింపు

పుళల్ జలాశయం నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలను అధికారులు తగ్గించారు. కొద్దిరోజులుగా తిరువళ్లూర్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా పుళల్ జలాశయానికి నీటి రాక పెరిగింది. ఈ కారణంగా డ్యాం భద్రత దృష్ట్యా ఈ నెల 3వ తేది నుంచి 2,500 ఘనపుటడుగుల అదనపు జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టి జలాశయానికి నీటి రాక తగ్గింది. ఈ కారణంగా, డ్యాం నుంచి విడుదల చేస్తున్న జలాలను 500 ఘనపుటడుగులకు తగ్గించారు. 24 అడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో శుక్రవారం ఉదయం నీటిమట్టాలు 22.62 అడుగులుగా ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి జలాశయంలోకి 1454 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. అలాగే, చెంబరంబాక్కం జలాశయానికి 1150 ఘనపుటడుగులు, పూండి జలాశయానికి 1310 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోందని ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు.



నగరంలో రోడ్లపై నిలిచివున్న నీరు

చంటి పిల్లలతో భిక్షాటనను అడ్డుకోవాలి

● రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రహదారుల్లో చంటి పిల్లలతో భిక్షాటనలో పాల్గొనేవారిపై తగు చర్యలు చేపట్టాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది. నగరంలోని రహదారుల్లో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద చిన్నపిల్లలతో మహిళలు భిక్షాటనలో పాల్గొంటున్నారని, ఆ మహిళలు ఆ పిల్లల తల్లులేనా? అని నిర్ధారించేలా విచారణ జరిపేందుకు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ న్యాయవాది తమిళ్‌వేందన్ హైకోర్టులో ఓ ప్రజావాజ్యం దాఖలు చేశారు. అందులో రోడ్లపై ఉన్న సిగ్నళ్ల వద్ద పిల్లలతో భిక్షాటనలో పాల్గొన్న మహిళలకు, పిల్లల వివరాలు సేకరించి వారి రక్త నమూనాలను పరీక్షించి కన్నతల్లేనా? అని నిర్ధారించాలని కోరారు. భిక్షాటనలో పాల్గొంటున్న మహిళలు తమిళంలో మాట్లాడటం లేదని, వారు ఇతర రాష్ట్రాల్లో కిడ్నాప్ చేసిన పిల్లలను భిక్షాటనకు ఉపయోగించుకుంటున్నారని, వారి వెనుకనుంచి నడిపిస్తున్నవారెవరో తెలుసుకునేలా విచారణ జరపాలని కోరారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌ఎం.శ్రీవాత్సవ, న్యాయమూర్తి జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ప్రథమ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. పిటిషనర్ కోరికలను పరిశీలించిన ధర్మాసనం చంటి పిల్లలతో నిర్వహించే భిక్షాటనను పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని, పిల్లల సంరక్షణకు సంబంధించి విధించిన నిబంధనలను అమలుపరచాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా కోర్టు వేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 98.23 శాతం 'సర్' ఫారాల నమోదు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 98.23 శాతం (6,29,79,208 ఓటర్లు) 'సర్' ఫారాలు శుక్రవారం వరకు నమోదుచేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఓటర్ల జాబితా నుంచి మృతిచెందినవారు, చిరునామాలో శాశ్వతంగా లేనివారు, రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నవారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులను కేంద్ర ఎన్నికల కమిషన్ చేపడుతోంది. ఆ ప్రకారం, తమిళనాడు, పుదుచ్చేరి సహా 12 రాష్ట్రాల్లో గత నెల 4వ తేది నుంచి సర్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 4వ తేదీతో ముగియాల్సిన ఈ పనులను 11వ తేది వరకు పొడిగించారు. ఈ క్రమంలో, రాష్ట్రంలోని 6,41,14,587 ఓటర్లలో శుక్రవారం (ఈ నెల 5వ తేది) గణాంకాల ప్రకారం 6,39,95,854 (99.81 శాతం) మందికి ఫారాలు అందజేయగా, వాటిలో 6,29,79,208 (98.23 శాతం) పూర్తిచేసి ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. అలాగే, పుదుచ్చేరిలో అందజేసిన 10,20,815 (99.93 శాతం) ఫారాల్లో 10,11,921 (99.05 శాతం) ఫారాలు ఎన్నికల కమిషన్‌కు అందజేశారని అధికారులు తెలిపారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జల్లికట్టు పోటీలు వీక్షించిన విదేశీ హాకీ క్రీడాకారులు



రాష్ట్ర సంప్రదాయ దుస్తులు ధరించి పోటీలు వీక్షిస్తున్న విదేశీ క్రీడాకారులు

అడయార్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కీలకరై కలైంజర్ సెంటినరీ మైదానంలో హాకీ క్రీడాకారుల కోసం ప్రత్యేక జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కొరియా, చైనా సహా ఏడు దేశాలకు చెందిన క్రీడాకారులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించారు. మదురైలో 14వ జూనియర్ ప్రపంచ కప్ హాకీ పోటీలు గత నెల 28వ తేదీన ప్రారంభమై ఈ నెల 8వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో 12 దేశాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. విదేశీ క్రీడాకారులకు ఆహ్లాదం కలిగించేలా, మదురై జిల్లా అలంగానల్లూర్ సమీపంలోని కీలకరై కలైంజర్ సెంటినరీ మైదానంలో జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక జల్లికట్టు పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మంత్రి మూర్తి, కార్పొరేషన్ కమిషనర్ చిత్రా విజయన్, జల్లికట్టు పేరవై అధ్యక్షులు రాజశేఖరన్‌లు జల్లికట్టు క్రీడాకారులచే ప్రతిజ్ఞ చేయించిన అనంతరం పోటీలు ప్రారంభించారు. కొరియా, ఒమన్, చైనా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా సహా 8 దేశాలకు చెందిన తలా 30 మంది హాకీ క్రీడాకారులు పోటీలను వీక్షించారు. వడివాసల్ నుంచి ఎద్దులను జల్లికట్టు క్రీడాకారులు అదుపుచేసే సమయంలో క్రీడాకారులు చప్పట్లు, కేకలు వేస్తూ ఉత్సాహపరిచారు. ఈ పోటీల్లో 104 ఎద్దులు, 50 మంది క్రీడాకారులు పాల్గొనగా, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు, ఎవరూ అదుపుచేయలేకపోయిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

ఎనిమిది మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగల స్వాధీనం

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీపరిధిలోని రాయవరం సెక్షన్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం స్థానిక ఫారెస్టు బీటు ఆఫీసర్ అంజనాస్వాతితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్ చిన్నముచ్చురాళ్లగుట్ట వద్ద కూంబింగ్ చేపట్టారు. కొంతమంది గుమికూడి ఉండటం గమనించి, సమీపిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఎనిమిది మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ ఖాదర్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.